ఏప్రిల్ ఒకటి నుంచి సన్న బియ్యం పంపిణీ : తాసీల్దార్

కందుకూరు, మార్చి 29 : ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రేషన్ కార్డులదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు కందు కూరు తాసీల్దార్ గోపాల్ తెలిపారు. ఉగాది పండుగ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభి స్తుందన్నారు. శనివారం తాసీల్దార్ తన కార్యాలయంలో మాట్లాడుతూ.. మండలంలోని 46 రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ డీలర్లు ఒకటో తేదీనే సన్న బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ 6 కిలోలు అందిస్తామని ఆయన వెల్లడించారు.

యూజీడీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం

- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- వీరన్నగుట్ట కాలనీలో మార్నింగ్ వాక్

మన్సూరాబాద్, మార్చి 29: పది కాలనీల్లో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్ట కాలనీలో శనివారం ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్ నిర్వహించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యపై కాలనీలవాసులతో మాట్లాడారు. ప్రైవేటు వ్యక్తుల స్థలం నుంచి డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులు చేపట్టాల్సి ఉండటంతో గత కొన్నేండ్లుగా పది కాలనీల ప్రజలు మురుగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ అవుట్‌లెట్ స్థలం ముషీరాబాద్ ఎమ్మెల్యే సన్నిహితులదని తెలి యడంతో.. వెంటనే ఎమ్మెల్యే స్థల యజమాని సోదరుడిని వీరన్నగుట్ట కాలనీకి పిలిపించారు. పది కాలనీలకు చెందిన 150 కుటుంబాలు ఎదుర్కొంటున్న యూజీడీ సమస్యను ఆయనకు వివరించారు. ట్రంక్ లైన్ వేసేందుకు కొంత భూ మిని ఇచ్చేందుకు రాజేందర్ ముందుకు వచ్చారు. సుమారు 560 ఫీట్ల పొడవు రెండు ఫీట్ల డయాలైన్ వేసేందుకు అంగీకరించారు.అనంతరం స్థల యజమానికి, ఎమ్మెల్యేకు ఆయా కాలనీల వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యూజీడీ ట్రంక్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేసి మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పార్టీలు,రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిం చను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు జే. రఘువీర్‌రెడ్డి, టీ. నాగరాజు, శ్రీధర్‌గౌడ్, అనిల్‌కుమార్, చంద్రారెడ్డి, నర్సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సత్యం, మహేందర్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్ట కాలనీలో యూజీడీ సమస్యపై స్థానికులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 30: ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్(ఏఐసీటీఈ)ఆల్ స్పెషలైజేషన్స్ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 9 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని విమర్శిస్తే ఊరుకోం..

- బీజేపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు..: బీఆర్ఎస్

బడంగ్‌పేట్, మార్చి 29: మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని విమర్శిస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, విజయలక్ష్మి, జలాల్పూర్ సునీతాబాలరాజ్, లలిత జగన్, సిద్దాల బీరప్ప తదితరులు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తి పన్ను తగ్గించే విషయంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాములు యాదవ్ చేస్తున్న వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చౌక బారు విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. బీజేపీ నుంచి ఎంపీలుగా గెలిచిన వారు రాష్ర్టానికి ఏం చేశారో చెప్పాలన్నారు. సమస్యలు పరిష్కరించలేని వారు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. శ్రీరాములు యాదవ్ ప్రజా సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు ఎందుకు ఆయన్ను తిరస్కరిస్తున్నారో తెలుసుకోవాలన్నారు.

టీ హబ్‌లో మిస్.. మిసెస్‌ల.. ఫ్యాషన్ షో

కొండాపూర్, మార్చి 29 : నాలెడ్జ్ సిటీలోని టీ హబ్‌లో శనివారం నిర్వహించిన మిస్ అండ్ మిసెస్, స్ట్రాంగ్ – బ్యూటీఫుల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల ప్రధాన కార్యదర్శి జై రంజన్, టాలీవుడ్ నటులు వితికాషేరు, నిర్వాహకులు కిరణ్మయి అలివేలు పాల్గొన్నారు. యువతులతో పాటు వివాహిత మహిళలు ర్యాంప్‌పై హొయలొలికిస్తూ కనువిందు చేశారు. కథక్ నృత్యకారిణి సంధ్య, హ్యాండ్‌లూమ్ క్యూరేటర్ శ్రీదేవి విజయదాస్, మిస్ గెలాక్సీ ఇండియా జష్నవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. నడక, నడత, శక్తి యుక్తుల ఆధారంగా విజేతలను ప్రకటించారు.

ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలి

సైదాబాద్ తాసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సైదాబాద్, మార్చి 29: కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శనివారం సైదాబాద్ మండల తాసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు నర్సింగరావు, సంతోష్‌నగర్ అధ్యక్షుడు చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి,అవసరమైన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రోజుల తరబడి ఆఫీస్ చుట్టూ తిప్పించుకుంటూ ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి : కార్పొరేటర్

నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ తదితరులు

మన్సూరాబాద్, మార్చి 29: నీటిని వృథా చేస్తే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి శ్రీనివాస కాలనీ కమ్యూనిటీ హాల్లో శనివారం సీడ్ స్వచ్ఛంద సంస్థ, జలమండలి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఇంకుడు గుంతల స్పెషలాఫీసర్ జాల సత్యనారాయణ, సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ ఎస్ నాగబ్రహ్మచారితో కలిసి కార్పొరేటర్ చింతల అరుణ కాలనీవాసులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటి పరిసరాలతోపాటు ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుతో ప్రతి చుక్క అందులోకి చేరి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజు, శ్రీనివాస కాలనీ అధ్యక్షుడు థామస్, కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

సైదాబాద్ ఎస్టీ కాలనీలో పేదముస్లింలకు రంజాన్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, మార్చి 29: రంజాన్ పండుగను పురస్కరించుకొని సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్ ఎస్టీ కాలనీలో శనివారం పేద ముస్లింలకు రంజాన్ కిట్లను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పవిత్ర మాసంలో పేదలకు సాయం చేయడంతో ముక్తి లభిస్తుందన్నారు. స్థానికంగా అనేకమంది ఎస్టీ ప్రజలకు రంజాన్ కిట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మార్చి 29 : నాణ్యతా ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం డీఈ దామోదర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ధనం వృథా కాకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గన్నా, భ్రమరాంబ, ఓం ప్రకాశ్, శ్రీకాంత్ తదతరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద వ్యర్థాల తొలగింపు

సైదాబాద్ రామాలయం వద్ద చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ తదితరులు

సైదాబాద్, మార్చి 29 : శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని హౌసింగ్ బోర్డు కాలనీ పరిసరాల్లో వ్యర్థాల తొలగింపు పనులను శనివారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని ఆలయాల వద్ద పారిశుధ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..రానున్న శ్రీరామ నవమి పంగుగ సందర్భంగా రథోత్సవం జరిగే రోడ్లపై చెట్ల కొమ్మలను, వ్యర్థాల కుప్పలను జీ హెచ్ఎంసీ హార్టికల్చర్ సిబ్బందితో తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధి వనం జగదీశ్వర్‌రావు, హార్టికల్చర్ సూపర్‌వైజర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత తదితరులు

సైదాబాద్, మార్చి 29 : ఐఎస్ సదన్ డివిజన్‌లోని సింగరేణి ఆఫీస్ కాలనీలో కొనసాగుతున్న సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ జంగం శ్వేత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైప్‌లైన్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలన్నారు. అభివృద్ధి పనులను జలమండలి అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జలమండలి మేనేజర్ రమ్య భారతి, షబ్బీర్, కాలనీవాసులు రమణ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు మసీదులు ముస్తాబు

కందుకూరు, మార్చి 29 : రంజాన్ పండుగకు మండలంలోని మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యా యి. కందుకూర్, కొత్తగూడ, పులిమామిడి, బాచుపల్లి, నేదునూరు, దాసర్లపల్లి, ముచ్చర్ల, దెబ్బడగూడ, బేగంపేట్, గుమ్మడవెల్లి, బైరాగిగూడ, గూడూరు, లేమూరు, సరస్వతిగూడ, గఫూర్ నగర్ గ్రామాల్లో మసీదులకు రంగులు వేసి రంగురంగుల విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. పోలీసులు మసీదుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

'అన్నదానంతో ఆత్మ సంతృప్తి'

చంపాపేట, మార్చి 29: అన్నదానం చేయడంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని శ్రీమాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటికార్ భగవత్ జీ అన్నారు. శనివారం అమావాస్య సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో చంపాపేట గాంధీబొమ్మ రోడ్డులోని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయం ఎదుట సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ ప్రెసిడెంట్ రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోశ్ లడ్డ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దండకారణ్యంలో నరమేధం ఆపాలి

ముషీరాబాద్, మార్చి 29: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో నరమేధం ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో నరమేధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇఫ్తార్‌విందులతో స్నేహపూర్వక బంధాలు

మలక్‌పేట : ప్రార్థనలు చేస్తున్న ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు షఫీ, నాయకులు

మలక్‌పేట, మార్చి 29: పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్‌విందులు మత సామరస్యానికి ప్రతీకలని పాత మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ అన్నారు. పాత మలక్‌పేట మటన్ మార్కెట్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ఎంఐఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి హాజరై మాట్లాడారు. రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందుల్లో అన్ని మతాల ప్రజలు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ప్రజల్లో మత సామరస్యాన్ని పెంచుతాయన్నారు. ప్రజల్లో స్నేహపూర్వక, సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందిస్తాయని అన్నారు. తద్వారా శాంతి సౌభ్రాతృత్వం మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

హయత్‌నగర్ చిన్న మసీద్‌లో ఇఫ్తార్‌విందులో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, ముస్లింలు

రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవా లి

హయత్‌నగర్ : రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ ఓల్డ్ విలేజ్లో రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా చిన్న మసీదులో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పెద్దలు కళ్లెం రవీందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎల్లప్ప, శీను, అశోక్, నాయకులు జఫర్, ఆలీ, రఫిక్, అమీర్, ఆసిఫ్, పాషా, సల్మాన్, సాజిద్, రెహమాన్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, మార్చి 29 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఉగాది పండుగను పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషుల కంటే మహిళలు ఎంతో శక్తివంతమైన వారన్నారు. అన్ని రంగాల్లో ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. తమ సంస్థ మహిళలకు అండగా ఉంటుందని, విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సైదాబాద్, మార్చి 29: ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్రో రైల్ ఉద్యోగి బోయ విజయలక్ష్మి, శేషు కుటుంబం సైదాబాద్ శంకేశ్వర్ బజార్ మహిళా పోలీస్‌స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్నది. వారి కుమార్తె హాసిని(14) స్థానికంగా ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన హాసిని డ్రెస్సు మార్చుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇండ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మన్సూరాబాద్, మార్చి 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫ్రంట్ చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర శనివారం ఎల్బీనగర్‌కు చేరుకుంది. ఎల్బీనగర్ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఫ్రంట్ చైర్మన్ చీమ శ్రీనివాస్ తదితరులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏప్రిల్ 21న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలో భాగంగా వెంటనే ఒక్కొక్కరికీ 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ. 25వేల పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఉద్యమకారులు గోర శ్యాంసుందర్‌గౌడ్, మారోజు రామాచారి, బీరెల్లి వెంకట్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రుణ బకాయిలను విడుదల చేయాలి



సైదాబాద్,మార్చి 29: రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 కోట్ల ఎస్సీ ట్రైకార్ రుణాలతోపాటు బీసీ ఎస్సీ మైనార్టీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని శనివారం గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సైదాబాద్ మండల కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఆర్. శంకర్ నాయక్. సీపీఎం నాయకులు బాలూనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకాన్ని తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటికే వారంతా కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోగా రుణాల మంజూరు, చెక్కులు సైతం సిద్ధమయ్యాయని, ఆ నిధులు బ్యాంకులకు విడుదల చేయకుండా కొత్త పథకం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణ బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే 7న ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం సైదాబాద్ తాసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి షేక్ మహమూద్, వెంకటేశ్, రఘు, పంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందజేత

'గార్డియన్స్ ఆఫ్ డ్రీమ్స్' సంస్థ పంపించిన ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు అందజేస్తున్న మార్గం రాజేశ్

ఆర్కేపురం, మార్చి 29 : రాష్ట్రంలోని చైల్డ్ కేర్ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థుల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు బెంగళూరుకు చెందిన 'గార్డియన్స్ ఆఫ్ డ్రీమ్స్' సంస్థ ఒక్కొక్కరికీ రూ. 50 వేల విలువైన ల్యాప్‌టాప్‌లను పంపించింది. గార్డియన్స్ ఆఫ్ డ్రీమ్స్ సంస్థ వారు గత ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అనాథ గృహ విద్యార్థి ఎస్ శివ, జి. కార్తిక్‌కు ల్యాప్‌టాప్‌లను బహుమతిగా పంపించారని గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా మార్గం రాజేశ్ మాట్లాడుతూ.. ఇద్దరు అనాథ విద్యార్థుల చదువులకు గార్డియన్ డ్రీమ్స్ సంస్థ రూ. 25 వేల చొప్పున మొత్తం రూ. 50 వేలను అందజేసి నట్లు తెలిపారు.